క్లుప్తంగా

ఆశా కార్యకర్తల నిరసన



బాలానగర్: ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వైద్యురాలు సృజనకు వినతిపత్రం అందజేశారు.

వర్షంలోనే రిలేదీక్షలు



కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని 226వ రోజు మంగళవారం వర్షం పడుతున్నా సాధన సమితి సభ్యులు రిలేదీక్షలను కొనసాగించారు. మండల కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ర్యాపిడ్ ఫోర్స్ కవాతు



దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహించింది. పట్టణంలోని పాత బస్టాండ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం చౌరస్తా నుంచి వాడల్లో కార్యక్రమం కొనసాగింది. ఆర్ఏఎఫ్ కమాండెంట్ శ్రీకాంత్, డీఎస్పీ రమణారెడ్డి, సీఐ రామకృష్ణ, ఎస్‌ఐలు వెంకటేశ్, మాధవరెడ్డి, శ్రీనివాసులు, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యానికి మేలు

జడ్చర్ల టౌన్: పోషకాహారంతో ఆరోగ్యానికి మేలు జరుగుతుందని బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ అన్నారు. మంగళవారం వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార వారోత్సవాల్లో పాల్గొని ప్రసంగించారు. విభాగ అధిపతి శ్రీనివాసులు, బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త డా. సదాశివయ్య, తెలుగు అధ్యాపకులు యాదయ్య, సుభాషిణి, నీరజ, విఠల్, మల్లికార్జున్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

రూ.30వేల సాయం

అడ్డాకుల: కందూర్ ఉపసర్పంచ్ శంకర్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురికాగా బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ రూ.30వేలను పంపడంతో మంగళవారం నాయకులు బాధితుడికి అందజేశారు. నాయకులు మున్నూర్ రమేష్, చాకలి రాకేష్, కొత్త కృష్ణయ్య, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అభినందన

మహబూబ్‌నగర్ క్రీడలు: నారాయణపేటలో ఇటీవల జరిగిన డ్రాగన్ షోటోకాన్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ హెచ్.ఉజ్వల తెలిపారు. ఈ మేరకు పతకాలు సాధించిన విద్యార్థులను మంగళవారం అభినందించారు. ఉపాధ్యాయుడు రఘు, కరాటే మాస్టర్ ఎస్‌కే. మోసీన్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ



దేవరకద్ర: నార్లోనికుంట్లలో ఎంపీపీ రమాదేవి ఆధ్వర్యంలో 6 మందికి గొర్రెలను పంపిణీ చేశారు. నాయకుడు శ్రీకాంత్‌యాదవ్, లబ్ధిదారులు అబ్బులయ్య, చెన్నప్ప, కేశవ్, వెంకప్ప, నర్సిములు, ఎమ్ చెన్నప్ప పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మిడ్జిల్: మండల అరెకటికెల సంఘం నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ప్రకాష్‌జీ, అధ్యక్షుడిగా నరేందర్‌జీ, ప్రధానకార్యదర్శిగా శివకుమార్, ఉపాధ్యక్షులుగా నాగేశ్వర్‌జీ, పూలదండ నాగేశ్వర్‌జీ, కార్యదర్శిగా అంబాజీ, కోశాధికారిగా వీరోజీ, ప్రచార కార్యదర్శిగా శివాజీ ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌జీ, ఖాజారాంజీ, రమేష్‌జీ పాల్గొన్నారు.

కులవృత్తులకు ప్రాధాన్యత

రాజాపూర్: బీఆర్ఎస్ పాలనలో కులవృత్తులకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఎంపీపీ సుశీల పేర్కొన్నారు. మంగళవారం దోండ్లపల్లి శివారులోని కుమ్మరికుంటలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపపిల్లలు వదిలి మాట్లాడారు. సర్పంచ్ లక్ష్మీదేవి, నాయకులు రమేష్‌నాయక్, డిప్యూటీ సర్పంచ్ యాదమ్మ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు పురస్కారాలు



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: ప్రభుత్వ బడులు, దవాఖానాలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలను అందజేసి సత్కరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, ఎంఈఓ మంజులాదేవి తదితరులు పాల్గొన్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎమార్సీ కేంద్రం ఆవరణలో సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

చిన్నచింతకుంట: గూడూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వై. నాగరాజు మంగళవారం మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతులమీదుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ఈ మేరకు ఆయనను స్థానికులు , ఉపాధ్యాయులు అభినందించారు.

అడ్డాకుల: కన్మనూర్‌కి చెందిన ఎం.రాజేష్‌కుమార్ మహేశ్వరంలో మహాత్మా జ్యోతిరావు పూలే కళాశాలలో పనిచేస్తూ ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. మంగళవారం మంత్రులు మహమూద్ అలీ, సబితారెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

నవాబుపేట: మండలంలోని వివిధ పాఠశాల్లో పనిచేస్తున్న విజయ్‌కుమార్, భానుప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, రవిశంకర్, మల్లికార్జున్, కృష్ణయ్య ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఎంఈఓ రాజునాయక్ తెలిపారు. వారిని మండల అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

సీనియర్ సిటిజన్‌ల సేవలు సమాజం ఉపయోగించుకుని మరింత ముందుకు పోవాలని ఫోరం మండల అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సన్మానించారు. నాయకులు చంద్రశేఖర్, చిన్నస్వామి, వెంకటేశ్వరప్ప, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మదన్‌మోహన్‌రెడ్డి, భాస్కర్, రాములు, హేమలత తదితరులను మంగళవారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించినట్లు మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

మహమ్మదాబాద్: నంచర్ల గురుకుల ప్రిన్సిపాల్ వెంకటమ్మ జిల్లా అధికారుల చేతులమీదుగా ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో అలోకిట్ మేనేజరు ప్రవీణ్‌కుమార్, ఆర్‌సీఓ ఫ్లారెన్స్ రాణి డీసీఓలు వాణి, రఘు, వనజ పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయులను సత్కరించారు. ఫోరం అధ్యక్షుడు నయీమొద్దీన్, ప్రకాష్, శంకర్‌బాబు, జమీలబేగం, యాదగిరి, ఇమామొద్దీన్‌లు పాల్గొన్నారు.

మిడ్జిల్: ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ సుదర్శన్, జెడ్పీటీసీ శశిరేఖ, ఎంపీటీసీ గౌస్, హెచ్‌ఎం సుధాకర్, నాయకులు వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జడ్చర్ల సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో..



కోయిలకొండలో..



మిడ్జిల్‌లో..



అవార్డు అందుకున్న నంచర్ల గురుకుల ప్రిన్సిపాల్

పోరాటాలకు సిద్ధం కావాలి



ధర్నాలో పాల్గొన్న నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కార్మికుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ సీనియర్ నాయకులు కిల్లెగోపాల్ పిలుపునిచ్చారు. తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికుల సమస్యలపై ఎస్ఈ వాసుదేవరావుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, యూనియన్ నాయకులు అంజయ్యగౌడ్, ఖాసీం, కురుమయ్య, శ్రీకాంత్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

నవాబుపేట: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీఓ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ యాదయ్య అన్నారు. మంగళవారం హజిలాపూర్, కొండాపూర్, నీర్‌సాబ్‌తండా, చాకలపల్లి గ్రామాల్లో పల్లె ప్రగతి పనులు, పరిశుభ్రతపై ఆరాతీశారు. పంచాయతీ రికార్డులు పరిశీలించారు. ఎంపీడీఓ శ్రీలత, ఎంపీహెచ్‌ఓ బద్రునాయక్ పంచాయతీ అధికారులు తదితరులు ఉన్నారు.

సౌతిండియా కరాటే పోటీలకు విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: త్రివేండ్రంలో ఈనెల 9, 10 తేదీల్లో జరిగే 2వ సౌతిండియా కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన జీకే మాస్టర్ షోటోకాన్ కరాటేడూ ఇండియా, కింగ్‌షోటోకాన్ క్లబ్ విద్యార్థులు పాల్గొననున్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించి సన్మానించారు. జీకే షోటోకాన్ చీఫ్ కృష్ణయ్య, కింగ్‌షోటోకాన్ క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను సన్మానించిన మాస్టర్లు

రాచాలలో సరస్వతిదేవీ బోనాలు



రాచాలలో బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

అడ్డాకుల: మండలంలోని రాచాలలో మంగళవారం సరస్వతిదేవీ బోనాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. అదేవిధంగా ఆలయం వద్ద నిర్వహించిన శకటోత్సవం ఆకట్టుకుంది.

జిల్లాకు మంచిపేరు తేవాలి : మంత్రి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కష్టపడి పని చేసి జిల్లాకు మంచి పేరు తేవాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం రెగ్యులరైజ్ ఉత్తర్వులను అందించారు. కలెక్టర్ రవి నాయక్ ఉన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని జడ్చర్ల–రాయచూర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్–167) వెంట ఎంబీసీ కాంప్లెక్స్ సమీపంలో మంగళవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పెద్ద మొక్కలను నాటారు. ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్‌చైర్మన్ తాటి గణేష్ కుమార్, కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



పత్రాలు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

రాములమ్మ కళాశాలలో ఫ్రెషర్స్ డే

పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీకే రెడ్డి కాలనీలో ఉన్న సరోజినీ రాములమ్మ ఫార్మాసి కళాశాలలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవంతో పాటు ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీయూ ఫార్మసీ విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ వి.ప్రభాకర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కళాశాల చైర్మన్ పి.బాలరాజు, ప్రిన్సిపాల్ కోటేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి క్విజ్‌పోటీలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటాక్ సంస్థ ఆధ్వర్యంలో భారత వారసత్వం, సంస్కృతిపై ఈనెల 13 నుంచి 16 వరకు మండలస్థాయి క్విజ్ పోటీలను నిర్వహించనున్నారు. సంస్థ కన్వీనర్ టి.నాగేంద్రస్వామి 17 మండలాలను 5 క్లస్టర్‌లుగా విభజించి పోటీలు నిర్వహిస్తామని ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మహబూబ్‌నగర్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న ఎన్నికల్లో మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఎన్ఎస్‌యూఐ విభాగం నుంచి గత 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పార్టీ పటిష్టత కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. తన సేవలను గుర్తించాలని కోరారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

బాలానగర్: పెద్దరేవల్లికి చెందిన పలువురు ఇతర పార్టీల నాయకులు మంగళవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మధు, విఠలయ్య గౌడ్, చెన్నకేశవులు, నాయకులు లింగారెడ్డి, శశికాంత్ రెడ్డి, శ్రీధర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

దేవరకద్ర: భారీగా కురుస్తున్న వర్షాలతో నియోజకవర్గంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండి వారికి సాయం అందించాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం నియోజకవర్గంలోని అధికారులు, ప్రజాప్రతినిధులతో ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో, మట్టి మిద్దెలలో ఉండేవారు సురక్షిత ప్రాంతాల్లో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలని కోరారు. కాల్వలు, చెక్‌డ్యామ్‌ల వైపు వెళ్లరాదని సూచించారు.

అధ్యక్షుడిగా రాంచంద్రయ్య



నవాబుపేట: మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా యన్మన్‌గండ్ల ఎంపీటీసీ సభ్యుడు రాంచంద్రయ్య నియమితులైనట్లు జిల్లా ప్రధానకార్యదర్శి బంగ్లరవి తెలిపారు. మంగళవారం నియామక పత్రం అందించి ఘనంగా సన్మానించారు.

జడ్చర్ల: మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా మల్లెబోయిన్‌పల్లికి చెందిన మాజీ ఎంపీపీ బూర్ల వెంకటయ్య, పట్టణ అధ్యక్షుడిగా మినాజ్‌లను నియమిస్తూ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ మంగళవారం అధికారిక ఉత్తర్వులు ఇచ్చారు.

బాలానగర్: మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా శంకర్ నాయక్‌ను నియమించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు.

పగిలిన పైపులైన్



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 21వ వార్డు పరిధిలోని శేషాద్రినగర్‌లో మంగళవారం కురిసిన వర్షానికి ఒకచోట రోడ్డంతా వరదతోపాటు మురుగు నిలిచింది. అలాగే చుట్టుపక్కల ప్రాంతాల్లోని రెండు, మూడు ఇళ్లలోకి చేరింది. స్థానికులు జేసీబీతో సీసీ రోడ్డు పక్క నుంచి కొంత దూరం కాల్వను తవ్విస్తుండగా అక్కడి మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయింది. వెంటనే మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా మూసి (డమ్మీ) వేయించారు. ఈ విషయమై ఏఈ వైష్ణవిని వివరణ కోరగా త్వరలోనే పైపులైన్‌ను బాగుచేయిస్తామన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ శాఖల్లో అధికారుల కోసం నడిపే వాహనాలకు ఇవ్వాల్సిన బిల్లులు వెంటనే విడుదల చేయాలని హైర్ వెకిల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ యాదవ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 18 నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఈ బిల్లులు రాకపోవడంతో అప్పుల పాలవుతున్నామని పేర్కొన్నారు. దీనికి తోడు అధికారులు సొంత వాహనాలను బినామీల పేర్లపై ప్రభుత్వ శాఖల్లో నడిపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

జడ్చర్ల: మెప్మా విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్స్, సీఆర్‌పీ, తదితర సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. సిబ్బంది సునీత, లక్ష్మి ఉన్నారు.

జిల్లాకేంద్రంలో ఏకధాటిగా వర్షం



ఎర్రకుంట తూము వద్ద పరిశీలిస్తున్న ఆర్డీఓ అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్



వర్నె వద్ద వాగులో దారి తెగిన చోట అధికారులు



కొత్తూర్ వద్ద..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో వరుసగా మూడోరోజు మంగళవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఓపెన్ నాలాలు పొంగి పొర్లాయి. ఆయా గల్లీల లోని రోడ్లపై వర్షపునీరు ఏరులై పారింది. వార్డు నం.25 పరిధిలోని గచ్చిబౌలిలో చిన్న చిన్న గల్లీలన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. కొత్త బస్టాండు వెనక భాగంలోని జగ్జీవన్‌రాంనగర్‌తో పాటు శేషాద్రినగర్, రామయ్యబౌలి, బీఎన్ రెడ్డికాలనీ, అయోధ్యనగర్, న్యూబాలాజీనగర్ తదితర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదిలా ఉండగా పెద్దచెరువులోకి కాల్వల ద్వారా వరద చేరుతోంది. న్యూటౌన్, రామయ్యబౌలి వైపు ఏర్పాటుచేసిన పెద్ద జాలీల వద్ద పేరుకుపోతున్న ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థ పదార్థాలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. వార్డు నం.28 పరిధిలోని ఎర్రకుంటను, జగ్జీవన్‌రాంనగర్‌ను ఆర్డీఓ అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, ఎంఈ యు.బస్వరాజ్, ఏఈ సాయిరాం తదితరులు పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.

జిల్లా కేంద్రంలో మంగళవారం కురిసిన వర్షానికి రాజీవ్‌సర్కిల్‌కు ఇరువైపులా వరద నిలిచిపోయింది. అక్కడ గతంలోనే నడిరోడ్డుపై మిషన్ భగీరథ తాగునీటి వాల్వ్ ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల ఇళ్లకు సరఫరా కోసం దానిని సాయంత్రం లైన్‌మన్ అలాగే తెరిచారు. ఇలా చేస్తే తాగు నీరు కలుషితం కాదా అని స్థానికులు వాపోతున్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు

అడ్డాకుల: వర్నె వాగులో తెగిపోయిన మట్టి దారిని మంగళవారం మండల అధికారులు పరిశీలించారు. తహసీల్దార్ ఘన్సీరాం, ఎంపీడీఓ మంజుల, ఎస్ఐ మాధవరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నర్ర శ్రీనివాస్‌లు వాగును ఎవరు దాటకుండా రోడ్డును మూసి వేయించారు. ఎవరూ వాగును దాటే సాహసం చేయొద్దని కోరారు.

శాఖాపూర్ శివారులో జాతీయ రహదారి పక్కన ఉన్న చెరువు మంగళవారం అలుగు పారింది. అలుగు వద్ద గ్రామస్తులు చేపలు పట్టారు.

కోయిల్‌కొండ: దమాయపల్లిలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఘణపతిరాయుడు చెరువు అలుగుపారడంతో తాత్కాలికంగా వేసిన రోడ్డు మంగళవారం ఉదయం కొట్టుకుపోయింది. గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో కొత్తగా వంతెన నిర్మాణం చేపడుతుండడంతో తాత్కాలికంగా ఈ రోడ్డు వేశారు. ఎంపీడీఓ జయరాములు కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలించారు.

మహమ్మదాబాద్: మండల పరిధిలోని గాధిర్యాల్ ఏటి చెరువు, ఊరచెరువు, లింగమయ్యచెరువు, బ్రాహ్మణ్‌చెరువు, నాయకమ్మచెరువు, సర్ఫరాజ్ చెరువు తదితరాలు నిండి జోరుగా అలుగు పారుతున్నాయి.

మిడ్జిల్: అధిక వానలకు దుందుభీ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఎవరు వెళ్లవద్దని ఎస్ఐ రామ్‌లాల్‌నాయక్ సూచించారు. మంగళవారం వాగును సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. కొత్తూర్– వెలుగొమ్ముల మధ్యలో ముందు జాగ్రత్తగా రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు.



శేషాద్రినగర్ కమాన్ నుంచి వెళ్లే దారిలో నిలిచిన నీరు



రాజీవ్ సర్కిల్‌లో నడిరోడ్డుపై..



దమయిపల్లిలో కొట్టుకుపోయిన రోడ్డు